క్లుప్తంగా

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



తక్కెళ్ళపాడు(జగ్గయ్యపేట): క్యాన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని బూచవరం ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారిణి ఎం. స్రవంతి పేర్కొన్నారు. గ్రామంలో వైద్యా ఆరోగ్య సిబ్బంది క్యాన్సర్‌పై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధి అయినప్పటికీ ముందుగా గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. 30ఏళ్ల పైబడిన వారు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె. శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ వెంకట్రావు, ఎంఎల్‌హెచ్‌పి రమణ, ఏఎన్‌ఎం బాలామృతం, కార్యదర్శి చంద్రశేఖర్, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం




చిల్లకల్లు(జగ్గయ్యపేట): తెలంగాణకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తోట శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. మండలంలోని అన్నవరం చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేపట్టి, ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇసుకను తెలంగాణకు తరలిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసి డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇసుక వత్సవాయి మండలం లింగాల మునేరు నుంచి అక్రమంగా తీసుకువస్తున్నట్లు గుర్తించామని ఎస్ఐ వివరించారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: మండలంలోని కీసర మున్నేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా లారీతోపాటు ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ బి.రాజు శుక్రవారం తెలిపారు. మున్నేరు నుంచి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ ద్వారా తరలించి లారీకి లోడ్ చేస్తుండగా పట్టుకున్నామని వివరించారు. ఈ మేరకు లారీ, ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు : ఎక్సైజ్ సీఐ



తొర్రకుంటపాలెం(జగ్గయ్యపేట): మద్యాన్ని అధికధరలకు విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ గురవయ్య శుక్రవారం హెచ్చరించారు. మద్యం షాపుల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. మద్యం షాపుల్లో లిక్కర్ బాటిల్స్ మాత్రమే విక్రయించాలని, అక్కడ సిట్టింగ్ ఏర్పాటు చేస్తే నిబంధనలు ఉల్లఘించినట్లేనన్నారు. ప్రభుత్వం బెల్ట్‌షాపులను పూర్తిగా నిషేధించిందని బెల్ట్ షాపులు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సర్కిల్‌లోని మద్యం దుకాణాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

చౌకగా మద్యం కాదు.. నిత్యావసరాలు ఇవ్వాలి

వించిపేట(విజయవాడపశ్చిమ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన మాటతప్పి నిత్యవసర ధరలు పెంచడం ప్రజలకు ద్రోహం చేయడమేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు ఆరోపించారు. 55వ డివిజన్‌లో గొల్లపాలెం గట్టు రోడ్డులో స్థానిక కార్పొరేటర్ బోయి సత్యబాబుతో కలసి శుక్రవారం 'ప్రజా పోరు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. డివిజన్‌లోని ప్రతి గడపకు వెళ్లి ప్రజా వ్యతిరేక విధానాలపై స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక ధరలు, ప్రజా సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపోరు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో చౌకగా మద్యం సరఫరా చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్తున్నారని, కాని ప్రజలకు కావాల్సింది మద్యం కాదని..నిత్యవసరాలు అని చంద్రబాబు గుర్తించాలని హితవు పలికారు. రాష్ట్రంలో రోజురోజుకు మహిళలు, మైనర్‌లపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు కూటమి నేతలు హడావుడి చేసి ప్రచారం పొంది, తరువాత పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. ఈ విషయాలపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత చూసి కూటమి నేతలు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ వారి తప్పులను కప్పిపుచ్చుకునే చర్యలకు దిగడం సిగ్గుచేటన్నారు. విద్యుత్ ట్రూ ఆప్ చార్జీల పేరుతో 17వేల కోట్లు ప్రజలపై భారం వేయడాన్ని సీపీఎం ఖండిస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార దిశగా ఈనెల 14న విజయవాడ కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పొలాల బాగుకు వ్యయప్రయాసలు

- ఇటీవలి వరదలకు కోతకు గురైన పొలాలు
- ఇసుక మేటతో సాగుకు పనికిరాని వైనం
- పొలాలను సాగుకు సన్నద్ధం చేసే పనిలో రైతులు
- ఇసుక మేటకు అందని నష్టపరిహారం
- ఇబ్బందుల్లో బాధిత రైతులు

పెనుగంచిప్రోలు: సెప్టెంబర్ నెల మొదటివారంలో కురిసిన భారీ వర్షాలు, సంభవించిన వరదలకు జగ్గయ్యపేట నియోజకవర్గంలో వేలాది ఎకరాల్లో పంటపొలాలు దెబ్బతినగా, వందలాది ఎకరాల భూముల్లో ఇసుక మేట వేసింది. మరికొన్ని పంటపొలాలు, మామిడి తోటలు వరద ఉధృతి కోతకు గురయ్యాయి. ఎంతో విలువైన భూములు వరదకు కొట్టుకుపోవడంతో పాటు, తోటలు నామరూపాలు లేకుండా పోయాయి. దీంతో ఆయా పొలాలను తిరిగి సాగుకు అనువుగా చేసేందుకు రైతులు పడరానిపాట్లు పడుతున్నారు.

325 ఎకరాల్లో ఇసుక మేట..

భారీ వర్షాల కారణంగా మునేరుకు భారీగా వరద రావడంతోపాటు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పాలేరు, మునేరు, తవ్వకాలువలు తెగిపోవడంతో పొలాలు కోతకు గురయ్యాయి. పంటభూముల్లో పెద్ద ఎత్తున ఇసుక మేట వేసింది. ఈ వరదలకు నియోకవర్గంలోని పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట మండలాల్లో మొత్తం 324.3 హెక్టార్లలతో ఇసుక మేట వేయగా, 87.5 హెక్టార్లలో భూములు కోతకు గురైనట్లు అధికారులు తేల్చారు. అయితే ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేలు చొప్పున మంజూరు అందజేయగా, ఇసుక మేట వేసిన పొలాలకు ప్రభుత్వం ఒక్కరూపాయి కూడా నష్టపరిహారం అందజేయలేదు. దీంతో కోతకు గురైన, ఇసుక మేట వేసిన పొలాల రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.





మునేరు వరదకు కోతకు గురికావడంతో మట్టితోలి సాగుకు సిద్ధం చేసిన పొలాలు

అప్పులు చేసి మరీ..

ఇసుక మేట వేసిన, కోతకు గురైన భూములకు తిరిగి సాగుకు అనుకూలంగా మార్చేందుకు వేలాది రూపాయలు ఖర్చుచేయక తప్పడం లేదని బాధిత రైతులు చెబుతున్నారు. ఈ ఖర్చులను భరించే పరిస్థితిలేక కొందరు రైతులు భూములను అలాగే వదిలివేయగా, తిరిగి భూములను సాగుచేయకపోతే భుక్తి ఎలా మరి కొందరు రైతులు అప్పోసప్పో చేస్తూ ఆయా భూములను బాగు చేసుకుంటున్నారు. రైతులు తమ పొలాల్లో ఉన్న ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. మునేరు పక్కన మామిడి తోటల రైతులు దూర ప్రాంతాల నుంచి రాళ్లను, మట్టిని తెప్పించి రక్షణ గోడ ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇందుకోసం వేలాది రూపాయలు ఖర్చవుతుండటంతో తమకు పెద్దభారంగా మారిందని బాధిత రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం వరదనష్ట పరిహారం కింద సాయం అందిస్తే ఆర్థికంగా చేయూతగా ఉంటుందని, ఇకనైనా ప్రభుత్వం ఆదిశగా చర్యలు తీసుకుని తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



మునేరు పక్కన మామిడితోటకు రాళ్లు, మట్టితో రక్షణగా ఏర్పాటు చేసిన కట్ట

మట్టిపోసి బాగు చేసుకున్నాను..



నేను గేదెల ఫాం పెట్టి పచ్చిగడ్డి సాగు కోసం మునేరు పక్కన పొలం కౌలుకు తీసుకున్నాను. వరదకు పొలం మొత్తం కొట్టుకు పోయింది. చేసేది లేక రైతుతో చెప్పి ప్రస్తుతం రూ.80వేలు ఖర్చు చేసి మట్టిపోసి పొలం బాగుచేసుకున్నాను.

– వట్టెం వెంకటేష్, రైతు, పెనుగంచిప్రోలు

భారీగా కోతకు గురైంది..



మునేరు వరదకు మామిడి తోటలు భారీగా కోతకు గురయ్యాయి.. నేను లీజుకు తీసుకున్న మామిడి తోట కూడా కోతకు గురై చెట్లు కొట్టుకుపోయాయి. తోటకు రక్షణ చర్యలు చేపట్టాలంటే చాలా ఖర్చవుతోంది. ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలి.

– జంగం కాశేశ్వరరావు, రైతు, పెనుగంచిప్రోలు

నందిగామ ఏసీపీ బదిలీ

నందిగామ టౌన్: నందిగామ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ బదిలీ అయ్యారు. ఆయనను పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ చేస్తూ డీజీపీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో పనిచేస్తున్న తిలక్ నందిగామ ఏసీపీగా నియమితులయ్యారు.

10న మహనీయుల విగ్రహావిష్కరణ



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు

వీరులపాడు: మండలంలోని కొణతాలపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన జ్యోతీరావుఫూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహాలను ఈనెల 10న సాయంత్రం నాలుగు గంటలకు ఆవిష్కరించనున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కోట సంగయ్య తెలిపారు. విగ్రహావిష్కరణకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యలతోపాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో కొండూరు సంగయ్య, నంద్రు విజయబాబు, నెలకూరి శోభన్, నంద్రు కరుణాకర్, నంద్రు తిరుపతిరావు, నెలకుర్తి గోపి, నంద్రు శ్రీనివాసరావు, బడేమియా, సంగమేశ్వరరావు, పరిమి కాంతారావు పాల్గొన్నారు.

ఎంపీ కనుసన్నల్లోనే ఇసుక అక్రమ రవాణా

తన్నీరు నాగేశ్వరరావు

వత్సవాయి: టీడీపీ రెడ్‌బుక్ రాజ్యాంగం ఎక్కువ కాలం నడవదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. ఆయన శుక్రవారం ఇసుక అక్రమరవాణా, ప్రభుత్వ ఇసుక విధివిధానాలలో సామాన్యులకు జరుగుతున్న అన్యాయంపై వత్సవాయి తహశీల్దార్‌ను కలిసి చర్చించారు. అనంతరం తన్నీరు నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ జిల్లాల్లో ఇసుక తవ్వకాలను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కనుసన్నల్లో ఎంపీ కేశినేని చిన్ని బినామీగా ఉండి వ్యవహారం నడిపిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం లేదని లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగమే నడుస్తోందన్నారు. ఇటీవలి వరదలకు వత్సవాయి మండలంలో ఆళ్లూరుపాడు, పాత వేమవరం, కొత్త వేమవరం, పెనుగంచిప్రోలు మండలంలో ముచ్చింతాల, అనిగిండ్లపాడు, గుమ్మడుదుర్రు వంటి ప్రాంతాల్లో ఇసుక మేట వేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. బాధిత రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణిశ్రీనివాస్, విజయవాడ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం డైరక్టర్ నంబూరి రవి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొలికపుడి వెంకటేశ్వర్లు, దబ్బాకుపల్లి సర్పంచ్ కె.నగేష్, నాయకులు వూట్ల నాగేశ్వరరావు, కనగాల రమేష్, దేరంగుల శ్రీను, కుక్కల శ్రీధర్, బాజీ, రాయల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు

ఊరచెరువు పరిశీలన

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణాన్ని స్వచ్ఛ జగ్గయ్యపేటగా మారుస్తామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తెలిపారు. పట్టణంలోని ఊరచెరువు, దాని పరిసర ప్రాంతాలను ఎమ్మెల్యే తాతయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఊర చెరువును పర్యాటక కేంద్రంగా మారుస్తామని తెలిపారు. చుట్టప్రక్కల ప్రాంతాల్లో చెత్త లేకుండా చెరువుల సైతం అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వాకింగ్ ట్రాక్‌పై నడిచే వీలులేకుండా గడ్డి పెరిగిపోయినందున వారంరోజుల్లో పూర్తిస్థాయిలో పునర్నిర్మాణ పనులు చేపడతామన్నారు. నిరుపయోగంగా ఉన్న బీసీ కమ్యూనిటీ భవన్‌ను కూడా వాడుకలోకి తీసుకువస్తామని వివరించారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావు, కౌన్సిలర్లు రామలక్ష్మి, వెంకట్రావు, ఎస్.మనోహర్, గొట్టె నాగరాజు, నాయకులు కర్ల జోజి, వేదులాపురి సైదా, పుల్లారావు, కావేటి కోటి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఊరచెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, రాఘవేంద్ర తదితరులు

సృజనాత్మకతను వెలికితీసేందుకే సైన్స్ ఎక్స్‌పో

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థులలో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఎక్స్‌పో ఎంతగానో దోహదంపడుతుందని సెయింట్ పాల్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ లంక కరుణాకర్‌దాస్ పేర్కొన్నారు. గొల్లపూడి పంచాయతీ పరిధిలోని నల్లకుంట సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన త్రీ డైమన్షనల్ షేప్స్, ఇస్రో రాకెట్ ప్రయోగాలు, డ్రిప్ ఇరిగేషన్, ఎఫెక్టెడ్ ఏరియాస్ బై బుడమేరు మోడల్‌ను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. తెలుగుతల్లి, మహాత్మాగాంధీ వేషధారణలో విద్యార్థులు ప్రత్యేకాకర్షణగా నిలిచారు. ఈసందర్భంగా అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్(మార్కెటింగ్) ఎం.దివాకరరావు మాట్లాడుతూ దేశంలో ప్రసిద్ధి చెందిన శాస్త్రవేత్తలను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సైన్స్‌పై విద్యార్థులకు ఉన్న ఆసక్తిని గమనించి, వారిని అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జాయిస్‌భూషణ్ కుమారి, క్యాపిటల్ మెరిట్స్ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ వైవీకె సత్యానంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సైన్స్ ఎక్స్‌పోను తిలకిస్తున్న కాలేజీ విద్యార్థినులు

విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: విద్యార్థులు చదువుతో పాటు మంచి నడవడికను అలవరచుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)సూచించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో ఈఏడాది ప్రారంభించిన ఇంటర్మీడియట్ కోర్సులో జాయిన్ అయిన బాలికలకు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సొంత నిధులతో సమకూర్చిన యూనిఫాంను శుక్రవారం ఎమ్మెల్యే తాతయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులు కష్టాన్ని మరిచిపోకుండా చక్కగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు మంచి అలవాట్లను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గొట్టె నాగరాజు, ఎంఈవో చిట్టిబాబు, నాయకులు నోముల రఘు, దువ్వల రామకృష్ణ, గింజుపల్లి కృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ శ్రీలక్ష్మి, హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓట్ల మార్పులు, చేర్పులకు అవకాశం

కంచికచర్ల: ఈనెల 9,10వ తేదీల్లో ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓట్ల మార్పులు, చేర్పులు చేసుకునేందుకు వీలు కల్పిస్తున్నట్లు తహసీల్దార్ పి.జాహ్నవి శుక్రవారం తెలిపారు. పోలింగ్ కేంద్రాల స్థాయి అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి ఓట్ల మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన ఫాం-6, 7, 8ను స్వీకరిస్తారన్నారు. బీఎల్వోలంతా ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆయా పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని తహసీల్దార్ సూచించారు.

16న గురజాడ సాహితీ వైభవం

విజయవాడ కల్చరల్: ఈనెల 16న బందరు రోడ్డు లోని ఠాగూరు గ్రంథాలయంలో నవయుగ కవితా వైతాళికుడు గురజాడ అప్పారావు సాహితీ వైభవం కార్యక్రమం నిర్వహిస్తునట్లు రసభారతి కార్యదర్శి డాక్టర్ జంధ్యాల పరదేశిబాబు శుక్రవారం తెలిపారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ సత్యవతి, డాక్టర్ పింగళి వెంకట కృష్ణారావు ప్రసంగిస్తారని వివరించారు.

విద్యార్థులకు ప్రత్యేకంగా యూనిక్ కోడ్

గౌరవరం(జగ్గయ్యపేట): విద్యార్థులకు యూనిక్ కోడ్ నంబర్ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రి) ప్రక్రియను ప్రధానోపాధ్యాయులు త్వరితగతిన పూర్తిచేయాలని ఎంఈవో చిట్టిబాబు సూచించారు. గౌరవరం మండల, జిల్లాపరిషత్ పాఠశాలల్లో విద్యార్థుల వివరాలను రిజిస్ట్రేషన్ చేస్తున్న విధానాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 12సంఖ్యలతో విద్యార్థులకు ఒక ఐడీ కేటాయిస్తారన్నారు. ఒకే దేశం, ఒకే స్టుడెంట్ ఐడీ విధానం నూతన జాతీయ విద్యావిధానం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ ఆపార్ నంబర్‌లో విద్యార్థి యొక్క పూర్తి సమాచారం ఉంటుందని తెలిపారు. ప్రైవేటు ఉపాధ్యాయులు కూడా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం ఆయన చిల్లకల్లు, జగ్గయ్యపేటలోని ఆయా పాఠశాలలను సందర్శించి అపార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు.



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంఈవో

ఎన్నికల హామీల అమలుకు డిమాండ్



చందర్లపాడులో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నేత కటారపు గోపాల్, నాయకులు, కార్మికులు

జగ్గయ్యపేట అర్బన్: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ గౌస్‌మియా మాట్లాడుతూ భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామంటూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్నా హామీల అమలుకు కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ విమర్శించారు. తక్షణమే భవన నిర్మాణ కార్మికుల పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లు, కార్మికుల కార్డులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్.రామనాథం, కోట రవికుమార్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉపేంద్ర, శ్రీనివాసరెడ్డి, భాషా తదితరులు పాల్గొన్నారు.

చందర్లపాడులో నిరసన...

చందర్లపాడు(నందిగామటౌన్): భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం వెంటనే అమలుచేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. చందర్లపాడు బస్టాండ్ వద్ద సీఐటీయూ చందర్లపాడు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఈసందర్భంగా గోపాల్ మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణరంగంలో 36రకాల వృత్తులకు సంబంధించి 1.50లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల క్లెయిమ్స్‌ను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్‌నాయకులు తోట రామారావు, శివారెడ్డి, నందు శ్రీను, ఎస్‌కె అబ్దుల్, ఎస్‌కె రంజాన్, పందు మస్తాన్, షేక్ లాల్, రంగశెట్టి ఏడుకొండలు, గంగరబోయిన వెంకటసోమయ్య, షేక్ సుభాని, సీఐటీయూ కార్యకర్తలు పాల్గొన్నారు.



పేట తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

మల్లేశ్వరస్వామికి విశేష పూజలు



దీపాలంకరణ సేవలో ఆది దంపతులు



స్వామి వారిని దర్శించుకుంటున్న ఈవో రామరావు, ఆలయ అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారికి శుక్రవారం విశేష పూజలు, అభిషేకాలు, దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మల్లేశ్వరస్వామి వారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ జరిగాయి. సాయంత్రం స్వామి వారి ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు లింగార్చనను ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సహస్ర లింగార్చన అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ జరిగింది. ఆలయ ఈవో కెఎస్.రామరావు, ఆలయ వైదిక కమిటీ సభ్యులు, వేద పండితులు స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవ మూర్తులకు పూజల అనంతరం దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు .

అలరించిన భక్తిసంగీతం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన అన్నమయ్య సంకీర్తన గాన ప్రచార భక్తబృందం ఆలపించిన భక్తిగీతాలు భక్తులను రంజింపచేశాయి. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ధర్మపథం వేదికపై పప్పు సదాశివశాస్త్రి పలు కీర్తనలను, గీతాలను ఆలపించారు. సదాశివశాస్త్రికి వయోలిన్‌పై చావాలి శ్రీనివాస్, మృదంగంపై చావాలి కృష్ణమోహన్ చక్కటి సహకారం అందించారు. అమ్మవారిని దర్శించుకుని మహా మండపంకు చేరుకున్న భక్తులు ధర్మపథం వేదికపై జరుగుతున్న కార్యక్రమాన్ని ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. అనంతరం ఆలయ అధికారులు సదాశివశాస్త్రి బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.